Telugu Bhakti Pages

www.telugubhakti.com

Printer friendly version

Join Telugu Bhakti Pages group to get updates/ to participate in Dharmic discussions and to share thrilling religious views and divine experiences.

Click http://groups.yahoo.com/group/TeluguBhaktiPages/

శ్రీమద్భగవద్గీత

ఓం శ్రీపరమాత్మనే నమః

అథ చతుర్ధశోఽధ్యాయః - గుణత్రయవిభాగయోగః

శ్రీభగవాన్ ఉవాచ

1 పరం భూయః ప్రవక్ష్యామి జ్ఞానానాం జ్ఞానముత్తమమ్ ।

యద్ జ్ఞాత్వా మునయస్సర్వే పరాం సిద్ధిమితో గతాః ॥

పరం-భూయః-ప్రవక్ష్యామి-జ్ఞానానాం-జ్ఞానం- ఉత్తమం

యత్-జ్ఞాత్వా-మునయః-సర్వే-పరాం-సిద్ధిం- ఇతః-గతాః

యత్=దేనిని, జ్ఞాత్వా=గ్రహించి, సర్వే=సమస్తమైన, మునయః=మునులు, ఇతః= ఈ సంసారమున, పరాం= ఉత్తమమైన, సిద్ధిం=సిద్ధిని, గతాః=పొందిరో, పరం= ఉత్తమమైన, జ్ఞానానాం= జ్ఞానములలో, ఉత్తమం= ఉత్తమమైనది యగు, జ్ఞానం= విద్యను, భూయః= మరల, ప్రవక్ష్యామి= చెప్పుచున్నాను.

శ్రీ భగవానుడు పలికెను - జ్ఞానములలో అత్యుత్తమమైన పరమజ్ఞానమును నీకు మరల తెల్పుచున్నాను. ఆ పరమజ్ఞానమును తెలిసికొనిన మునులు సంసార బంధములనుండి విముక్తులై పరమసిద్ధిని పొందిరి.

2 ఇదం జ్ఞానముపాశ్రిత్య మమ సాధర్మ్యమాగతాః ।

సర్గేఽపి నోపజాయంతే ప్రలయే న వ్యథంతి చ ॥

ఇదం-జ్ఞానం- ఉపాశ్రిత్య-మమ-సాధర్మ్యం- ఆగతాః

సర్గే-అపి-న- ఉపజాయంతే-ప్రలయే-న-వ్యథంతి-చ

ఇదం= ఈ, జ్ఞానం = జ్ఞానమును, ఉపాశ్రిత్య = ఆశ్రయించి, మమ=నాయొక్క, సాధర్మ్యం= స్వరూపమును, ఆగతాః= పొందినవారు, సర్గే అపి= సృష్టియందు, న ఉపజాయంతే= పుట్టరు, ప్రలయే= ప్రళయ కాలమునందు, న వ్యథంతి చ = దుఃఖమును పొందరు.

ఈ జ్ఞానమును ఆశ్రయించినవారు నా స్వరూపమునే పొందుదురు. అట్టి పురుషులు సృష్టి కాలమందు మఱల జన్మింపరు, ప్రళయకాలమున నశింపరు.

3 మమ యోనిర్మహద్బ్రహ్మ తస్మిన్ గర్భం దధామ్యహమ్ ।

సంభవః సర్వభూతానాం తతో భవతి భారత ॥

మమ-యోనిః-మహత్-బ్రహ్మ-తస్మిన్-గర్భం-దధామి-అహం

సంభవః-సర్వభూతానాం-తతః-భవతి-భారత

భారత=అర్జునా, మహత్ బ్రహ్మ= మహత్తు లేక మాయ, మమ=నాకు, యోనిః= గర్భస్థానము, తస్మిన్= దానియందు, అహం=నేను, గర్భం= గర్భమును, దధామి= ఉంచుచున్నాను, తతః= ఆకారణముచే, సర్వభూతానాం= సర్వభూతముల యొక్క, సంభవః= ఉత్పత్తి, భవతి= అగుచున్నది.

ఓ అర్జునా ! నా మహద్బ్రహ్మరూపమైన మూలప్రకృతి సర్వప్రాణులకు జన్మ స్థానము.దానియందు చేతనసముదాయ రూపమైన బీజమును ఉంచెదను. దాని వలననే సర్వభూతముల ఉత్పత్తి కలుగుచున్నది.

4 సర్వయోనిషు కౌంతేయ మూర్తయః సంభవంతి యాః ।

తాసాం బ్రహ్మ మహద్యోనిః అహం బీజప్రదః పితా ॥

సర్వయోనిషు-కౌంతేయ-మూర్తయః-సంభవంతి-యాః

తాసాం-బ్రహ్మ-మహత్-యోనిః-అహం-బీజప్రదః-పితా

కౌంతేయ=అర్జునా, సర్వయోనిషు- సమస్త యోనులందును, యాః= ఏ, మూర్తయః= మూర్తులు, సంభవంతి= పుట్టుచున్నవో, తాసాం= వానికి, మహత్ బ్రహ్మ= ప్రకృతి, యోనిః= కారణము, అహం=నేను, బీజప్రదః=బీజప్రదాతను అగు, పితా=తండ్రిని.

ఓ అర్జునా ! నానాయోనులయందు జన్మించు ప్రాణులను తనగర్భమున ధరించు మూలప్రకృతియే ఆ ప్రాణులకు తల్లి. బీజస్థాపనచేయు నేను వాటికి తండ్రిని. అనగా సర్వప్రాణులకును ప్రకృతియే తల్లి. నేను తండ్రిని.

5 సత్త్వం రజస్తమ ఇతి గుణాః ప్రకృతిసంభవాః ।

నిబధ్నంతి మహాబాహో దేహే దేహినమవ్యయమ్ ॥

సత్త్వం-రజః-తమః- ఇతి-గుణాః-ప్రకృతి సంభవాః

నిబధ్నంతి-మహాబాహో-దేహే-దేహినం-అవ్యయం

మహాబాహో=అర్జునా, సత్త్వం= సత్త్వము, రజః= రజస్సు, తమః=తమస్సు, ఇతి= అనెడి, ప్రకృతిసంభవాః= ప్రకృతివలన పుట్టిన, గుణాః= గుణములు, అవ్యయం= నాశరహితుడైన, దేహినం= జీవుని, దేహే= దేహమునందు, నిబధ్నంతి= బంధించుచున్నవి.

ఓ అర్జునా ! ప్రకృతినుండి ఉత్పన్నములైన సత్త్వరజస్తమోగుణములు నాశములేని జీవాత్మను శరీరమున బంధించుచున్నది.

6 తత్ర సత్త్వం నిర్మలత్వాత్ ప్రకాశకమనామయమ్ ।

సుఖసంగేన బధ్నాతి జ్ఞానసంగేన చానఘ ॥

తత్ర-సత్త్వం-నిర్మలత్వాత్- ప్రకాశకం- అనామయం

సుఖసంగేన- బధ్నాతి-జ్ఞానసంగేన-చ-అనఘ

అనఘ =అర్జునా, తత్ర= ఆ గుణములయందు, ప్రకాశకం= ప్రకాశమును కలిగించు నదియు, అనామయం=నిర్వికారమ్మైనదియునైన, సత్త్వం= సత్త్వగుణము, నిర్మలత్వాత్= నిర్మలమగుటవలన, సుఖసంగేన= సుఖాభిలాష చేతను, జ్ఞానసంగేన చ=జ్ఞానాభిలాషచేతను, బధ్నాతి= బంధించుచున్నది.

ఓ పాపరహితుడా! ఈ మూడింటిలో సత్త్వగుణము నిర్మలమ్మైనది. కనుక ప్రకాశకమ్మైనది. వికారరహితమ్మైనది. కాని అది సుఖమునందలి ఆసక్తి చేత, జ్ఞానాభిమానము వలన మనుజుని బంధించుచున్నది.

7 రజో రాగాత్మకం విద్ధి తృష్ణాసంగసముద్భవమ్ ।

తన్నిబధ్నాతి కౌంతేయ కర్మసంగేన దేహినమ్ ॥

రజః-రాగాత్మకం-విద్ధి-తృష్ణా సంగ సముద్భవం

తత్-నిబధ్నాతి-కౌంతేయ-కర్మసంగేన-దేహినం

కౌంతేయ=అర్జునా, రజః= రజోగుణము, రాగాత్మకం= రాగముతో గూడినదిగను, తృష్ణాసంగ సముద్భవం= విషయాసక్తి వలన కలిగినవిగను, విద్ధి= తెలిసికొనుము, తత్=అది, దేహినం = ఆత్మను, కర్మసంగేన= కర్మాసక్తిచేత, నిబధ్నాతి= బంధించుచున్నది.

అర్జునా ! రజోగుణము రాగాత్మకము. అది కామము, ఆసక్తుల నుండి ఉత్పన్నమగునని యెఱుంగుము. అది జీవాత్మను కర్మలయొక్కయు, కర్మఫలముల యొక్కయు ఆసక్తిని కల్పించి జీవుని బంధించును.

8 తమస్త్వజ్ఞానజం విద్ధి మోహనం సర్వదేహినామ్ ।

ప్రమాదాలస్యనిద్రాభిః తన్నిబధ్నాతి భారత ॥

తమః-తు-అజ్ఞానజం-విద్ధి-మోహనం-సర్వదేహినాం

ప్రమాదాలస్య నిద్రాభిః-తత్-నిబధ్నాతి-భారత

భారత=అర్జునా, అజ్ఞానజం= అజ్ఞానము వలన కలిగిన, తమః తు= తమోగుణము, సర్వదేహినాం= సర్వ ప్రాణులకు, మోహనం= మోహమును కలుగజేయునదిగా, విద్ధి= గ్రహించుము, తత్=అది, ప్రమాదాలస్య నిద్రాభిః= మరపుచేతను అలసత్వము చేతను నిద్రచేతను, దేహినం= దేహిని, నిబధ్నాతి= బంధించుచున్నది.

అర్జునా ! తమోగుణము సకలదేహాభిమానులను మోహితులనుగా చేయును. అజ్ఞానమువలన జనించును. అది జీవుని బంధించి వేయుచున్నది.

9 సత్త్వం సుఖే సంజయతి రజః కర్మణి భారత ।

జ్ఞానమావృత్య తు తమః ప్రమాదే సంజయత్యుత ॥

సత్త్వం-సుఖే-సంజయతి-రజః-కర్మణి-భారత

జ్ఞానం- ఆవృత్య-తు-తమః-ప్రమాదే-సంజయంతి- ఉత

భారత=అర్జునా, సత్త్వం=సత్త్వగుణము, సుఖే= సుఖమునందు, సంజయతి= చేర్చుచున్నది, రజః=రజోగుణము, కర్మణి=కర్మలయందు, సంజయతి= చేర్చుచున్నది, తమః తు= తమోగుణము, జ్ఞానం= జ్ఞానమును, ఆవృత్య= ఆవరించి, ప్రమాదే= ప్రమాదము నందు, సంజయతి ఉత= చేర్చుచున్నది గదా.

ఓ అర్జునా ! సత్త్వగుణము జీవుని సుఖములలో నిమగ్నము చేయును. రజోగుణము కర్మలయందు నిమగ్నునిగా చేయును. తమోగుణము జ్ఞానమును కప్పివేసి ప్రమాదాదులలో ముంచును.

10 రజస్తమశ్చాభిభూయ సత్త్వం భవతి భారత ।

రజఃసత్త్వం తమశ్చైవ తమః సత్త్వం రజస్తథా ॥

రజః-తమః-చ-అభిభూయ-సత్త్వం-భవతి-భారత

రజః-సత్త్వం-తమః-చ- ఏవ-తమః-సత్త్వం-రజః-తథా

భారతా=అర్జునా, సత్త్వం= సత్త్వగుణము, రజః=రజోగుణము, తమః చ=తమోగుణము, అభిభూయ= తిరస్కరించి, భవతి = అగుచున్నది, రజః=రజోగుణము, సత్త్వం=సత్త్వగుణమును, తమః చ ఏవ= తమోగుణమును, తథా = అటులనే, తమః= తమోగుణము, సత్త్వం= సత్త్వగుణమును, రజః= రజోగుణమును.

ఓ అర్జునా !రజస్తమోగుణములనణచి సత్త్వగుణము వృద్ధిచెందును. సత్త్వతమో గుణములనణచి రజోగుణము వృద్ధి చెందును. అట్లే సత్త్వరజో గుణములనణచి తమోగుణము వృద్ధియగుచుండును.

11 సర్వద్వారేషు దేహేఽస్మిన్ ప్రకాశ ఉపజాయతే ।

జ్ఞానం యదా తదా విద్యాత్ వివృద్ధం సత్త్వమిత్యుత ॥

సర్వద్వారేషు-దేహే-అస్మిన్-ప్రకాశః- ఉపజాయతే

జ్ఞానం-యదా-తదా-విద్యాత్-వివృద్ధం-సత్త్వం- ఇతి- ఉత

అస్మిన్= ఈ, దేహే= దేహమునందు, సర్వద్వారేషు= సర్వద్వారముల యందును, ప్రకాశః= ప్రకాశమగు, జ్ఞానం= జ్ఞానము, యదా= ఎప్పుడు, ఉపజాయతే=

పుట్టుచున్నదో, తదా=అప్పుడు, సత్త్వం= సత్త్వగుణము, వివృద్ధం ఇతి= వృద్ధిని జెందినదని, విద్యాత్ ఉత= తెలిసికొనవలెనుగదా.

శరీరేంద్రియములయందును, అంతఃకరణమునందును చైతన్యము, వివేకశక్తి ఉత్పన్నములైనప్పుడు అతనిలో సత్త్వగుణము వృద్ధిచెందినదని గ్రహింపుము.

12 లోభః ప్రవృత్తిరారంభః కర్మణామశమః స్పృహా ।

రజస్యేతాని జాయంతే వివృద్ధే భరతర్షభ ॥

లోభః-ప్రవృత్తిః- ఆరంభః- కర్మణాం-అశమః- స్పృహా

రజసి- ఏతాని-జాయంతే-వివృద్ధే-భరతర్షభ

భరతర్షభ= అర్జునా, రజసి=రజోగుణము, వివృద్ధే= వృద్ధిని పొందునపుడు, లోభః= లోభము, ప్రవృత్తిః= ప్రవృత్తియు, కర్మణాం= కర్మలయొక్క, ఆరంభః= ఆరంభము, అశమః= అశాంతి, స్పృహా= ఆశ, ఏతాని= ఇవి, జాయంతే= కలుగుచున్నవి.

ఓ అర్జునా ! రజోగుణము వృద్ధియైనప్పుడు లోభము, ప్రవృత్తి, (ప్రాపంచిక విషయములయందు ఆసక్తి) స్వార్థబుద్ధితో సకామభావముతో కర్మాచరణము, అశాంతి, విషయభోగములయందు లాలస మొదలగు గుణములు కలుగును.

13 అప్రకాశోఽప్రవృత్తిశ్చ ప్రమాదో మోహ ఏవ చ ।

తమస్యేతాని జాయంతే వివృద్ధే కురునందన ॥

అప్రకాశః-అప్రవృత్తిః-చ-ప్రమాదః-మోహః- ఏవ-చ

తమసి- ఏతాని- జాయంతే-వివృద్ధే-కురునందన

కురునందనా = అర్జునా, తమసి= తమోగుణము, వివృద్ధే=వృద్ధినొందినపుడు, అప్రకాశః= అజ్ఞానము, అప్రవృత్తిః చ= నిర్వ్యాపారం, ప్రమాదః= అజాగ్రత్త, మోహః ఏవ చ= మూఢభావము, ఏతాని= ఇవి, జాయంతే= కలుగుచున్నవి.

ఓ అర్జునా ! తమోగుణము అధికమైనప్పుడు అంతః కరణమునందును. ఇంద్రియములయందును వివేకశక్తి నష్టమగును. కర్తవ్యకర్మలయందు విముఖత, ప్రమాదము అనగా అంతఃకరణమును మోహములు కలుగును.

14 యదా సత్త్వే ప్రవృద్ధే తు ప్రలయం యాతి దేహభృత్ ।

తదోత్తమవిదాం లోకాన్ అమలాన్ ప్రతిపద్యతే ॥

యదా-సత్త్వే-ప్రవృద్ధే-తు-ప్రలయం-యాతి-దేహభృత్

తదా- ఉత్తమ విదాం- లోకాన్- అమలాన్-ప్రతిపద్యతే

యతా= ఎప్పుడు, సత్త్వే= సత్త్వగుణము, ప్రవృద్ధే= వృద్ధినొందినపుడు, దేహభృత్= దేహధారి, ప్రలయం తు= ప్రళయమును, యాతి= పొందుచున్నాడు, తదా=అప్పుడు, ఉత్తమ విదాం= ఉత్తమ జ్ఞానులయొక్క, అమలాన్= నిర్మలములైన, లోకాన్= లోకములను, ప్రతిపద్యతే= పొందుచున్నాడు.

సత్త్వగుణము వృద్ధిచెందినపుడు మనుజుడు మరణించినచో అతడు ఉత్తమ కర్మలను ఆచరించువారుచేరెడి నిర్మలములైన స్వర్గాది పుణ్యలోకములను పొందును.

15 రజసి ప్రలయం గత్వా కర్మసంగిషు జాయతే ।

తథా ప్రలీనస్తమసి మూఢయోనిషు జాయతే ॥

రజసి-ప్రలయం-గత్వా-కర్మసంగిషు-జాయతే

తథా-ప్రలీనః-తమసి-మూఢయోనిషు-జాయతే

రజసి=రజోగుణము వృద్ధినొందినపుడు, ప్రలయం=మృతిని, గత్వా=పొంది, కర్మసంగిషు=కర్మసంగత్వము గలవారి యందు, జాయతే=పుట్టుచున్నాడు, తథా=అట్లే, తమసి= తమోగుణమునందు, ప్రలీనః= మృతి నొందినవాడు, మూఢయోనిషు= మూఢ ప్రాణులయందు, జాయతే= పుట్టుచున్నాడు.

రజోగుణము వృద్ధిచెందినపుడు మృత్యువు ప్రాప్తించినచో అతడు కర్మాసక్తులైన మానవులలో జన్మించును. అట్లే తమోగుణము వృద్ధిచెందినప్పుడు మృతిచెందిన మానవుడు పశుపక్షికీటకాది నీచయోనులలో జన్మించుచున్నాడు.

16 కర్మణః సుకృతస్యాహుః సాత్త్వికం నిర్మలం ఫలమ్ ।

రజసస్తు ఫలం దుఃఖమ్ అజ్ఞానం తమసః ఫలమ్ ॥

కర్మణః-సుకృతస్య- ఆహుః-సాత్త్వికం-నిర్మలం-ఫలం

రజసః-తు-ఫలం-దుఃఖం-అజ్ఞానం-తమసః-ఫలం

సుకృతస్య= సుకృతమైన, కర్మణః= కర్మమునకు, సాత్త్వికం= సాత్త్వికమైన, నిర్మలం= నిర్మలత్వము, ఫలం= ఫలమును, రజసః తు= రజోగుణసంబంధమైన, దుఃఖం= దుఃఖము, ఫలం= ఫలము, తమసః= తమోగుణయుతమైన, అజ్ఞానం= అజ్ఞానము, ఫలం= ఫలమును అని, ఆహుః= చెప్పుదురు.

శ్రేష్ఠములైన కర్మలను ఆచరించుటవలన సాత్త్వికఫలము అనగా సుఖము, జ్ఞానము, వైరాగ్యము మొదలగు నిర్మలఫలములు కలుగును. రాజసకర్మలకు ఫలము దుఃఖము. తామసకర్మలకు అజ్ఞానము ఫలము.

17 సత్త్వాత్ సంజాయతే జ్ఞానం రజసో లోభ ఏవ చ ।

ప్రమాదమోహౌ తమసో భవతోఽజ్ఞానమేవ చ ॥

సత్త్వాత్-సంజాయతే-జ్ఞానం-రజసః-లోభః- ఏవ-చ

ప్రమోదమోహౌ-తమసః-భవతః-అజ్ఞానం- ఏవ-చ

సత్త్వాత్= సత్త్వగుణమువలన, జ్ఞానం= జ్ఞానము, సంజాయతే= కలుగుచున్నది, రజసః= రజోగుణమువలన, లోభః ఏవ చ= లోభగుణము, సంజాయతే= కలుగుచున్నవి,

తమసః= తమోగుణమువలన, ప్రమాదమోహౌ= ప్రమాదమును, అజ్ఞానం ఏవ చ= అజ్ఞానమును, భవతః= కలుగుచున్నవి.

సత్త్వగుణమువలన జ్ఞానమూ, రజోగుణమువలన లోభమూ, తమో గుణము వలన ప్రమాదమోహాదులూ, అజ్ఞానమూ తప్పక సంభవించును.

18 ఊర్ధ్వం గచ్ఛంతి సత్త్వస్థాః మధ్యే తిష్ఠంతి రాజసాః ।

జఘన్యగుణవృత్తిస్థాః అధో గచ్ఛంతి తామసాః ॥

ఊర్ధ్వం-గచ్ఛంతి-సత్త్వస్థాః-మధ్యే-తిష్ఠంతి-రాజసాః

జఘన్య గుణ వృత్తిస్థాః-అధః-గచ్ఛంతి-తామసాః

సత్త్వస్థాః= సత్త్వగుణము నందున్నవారు, ఊర్ధ్వం= ఊర్ధ్వమునకు, గచ్ఛంతి= పోవుచున్నారు, రాజసాః= రజోగుణము గలవారు, మధ్యే= మధ్యను, తిష్ఠంతి= నిలుచుచున్నారు, జఘన్య గుణవృత్తిస్థాః=నికృష్టమైన గుణప్రవృత్తిగల, తామసాః= తమోగుణము కలవారు, అధః=క్రిందికి, గచ్ఛంతి=పోవుచున్నారు.

సత్త్వగుణస్థితులు స్వర్గాది - ఊర్ధ్వలోకములకు పోవుదురు. రజోగుణస్థితులైన పురుషులు మధ్య లోకమునందే ఉందురు. తమోగుణ కార్యరూపములైన నిద్రా ప్రమాదాలస్యాదులయందు స్థితులైనవారు అధోగతిని పొందుదురు.

19 నాన్యం గుణేభ్యః కర్తారం యదా ద్రష్టానుపశ్యతి ।

గుణేభ్యశ్చ పరం వేత్తి మద్భావం సోఽధిగచ్ఛతి ॥

న-అన్యం-గుణేభ్యః-కర్తారం-యదా-ద్రష్టా-అనుపశ్యతి

గుణేభ్యః-చ-పరం-వేత్తి-మద్భావం-సః-అధిగచ్ఛతి

ద్రష్టా= ఆత్మదర్శి, గుణేభ్యః= గుణములకంటెను, అన్యం= ఇతరుడైన, కర్తారం= కర్తను, యదా= ఎప్పుడు, న అనుపశ్యతి = చూడడో, గుణేభ్యః= గుణములకంటెను, పరం చ =

అతీతముగాను, వేత్తి= తెలిసికొనుచున్నాడో, సః= వాడు, మద్భావం= నా భావమును, అధిగచ్ఛతి= పొందుచున్నాడు.

ద్రష్టయైనవాడు గుణములే గుణములయందు వర్తించు చున్నవనియూ, త్రిగుణములుతప్ప వేఱుగా కర్తలు లేరనియూ తెలిసికొని, త్రిగుణములకు అతీతముగానున్న నా తత్త్వమును తెలిసికొనును. అప్పుడతడు నా స్వరూపమునే పొందుచున్నాడు.

20 గుణానేతానతీత్య త్రీన్ దేహీ దేహసముద్భవాన్ ।

జన్మమృత్యుజరాదుఃఖైః విముక్తోఽమృతమశ్నుతే ॥

గుణాన్- ఏతాన్-అతీత్య-త్రీన్-దేహీ-దేహసముద్భవాన్

జన్మమృత్యు జరా దుఃఖైః-విముక్తః-అమృతం-అశ్నుతే

దేహీ=జీవుడు, దేహసముద్భవాన్=దేహముకలుగుటకు, ఏతాన్ = ఈ, త్రీన్= మూడైన, గుణాన్= గుణములను, అతీత్య= అతిక్రమించి, జన్మమృత్యు జరా దుఃఖైః= జన్మము మృత్యువు ముసలితనము దుఃఖములచేతను, విముక్తః= విడువబడినవాడై, అమృతం= మోక్షమును, అశ్నుతే=పొందుచున్నాడు.

దేహోత్పత్తికి కారణరూపములైన ఈ మూడు గుణములను అధిగమించిన పురుషుడు జన్మ, మృత్యు, జరా (వార్ధక్య), దుఃఖములనుండి విముక్తుడై, పరమానందమును పొందుచున్నాడు.

అర్జున ఉవాచ

21 కైర్లింగైః త్రీన్ గుణానేతాన్ అతీతో భవతి ప్రభో ।

కిమాచారః కథం చైతాన్ త్రీన్ గుణానతివర్తతే ॥

కైః-లింగైః-త్రీన్-గుణాన్- ఏతాన్- అతీతః-భవతి-ప్రభో

కిం- ఆచారః-కథం-చ- ఏతాన్-త్రీన్-గుణాన్-అతివర్తతే

ప్రభో=కృష్ణా, ఏతాన్= ఈ, త్రీన్= మూడైన, గుణాన్= గుణములను, అతీతః= అతిక్రమించినవాడు, కైః లింగైః= ఏ లక్షణము గలవాడు, కిమాచారః= ఎట్టి ఆచారముగలవాడు, భవతి= అగుచున్నాడు, ఏతాన్= ఈ, త్రీన్= మూడైన, గుణాన్= గుణములను, కథం చ= ఎటుల, అతివర్తతే= అతిక్రమించుచున్నాడు.

అర్జునుడు పలికెను - ఓ ప్రభూ ! ఈ మూడు గుణములకును అతీతుడైనవాని లక్షణములెవ్వి ? అతని లోకవ్యవహారరీతి యెట్లుండును ? మనుష్యుడు త్రిగుణములను ఎట్లు అతిక్రమించును ?

శ్రీభగవాన్ ఉవాచ

22 ప్రకాశం చ ప్రవృత్తిం చ మోహమేవ చ పాండవ ।

న ద్వేష్టి సంప్రవృత్తాని న నివృత్తాని కాంక్షతి ॥

ప్రకాశం-చ-ప్రవృత్తిం-చ-మోహం- ఏవ-చ-పాండవ

న-ద్వేష్టి-సంప్రవృత్తాని-న-నివృత్తాని-కాంక్షతి

పాండవ= అర్జునా, సంప్రవృత్తాని= సంప్రాప్తములైన, ప్రకాశం చ = ప్రకాశమును, ప్రవృత్తిం చ = ప్రవృత్తిని, మోహం ఏవ చ = మోహమును, న ద్వేష్టి= ద్వేషింపడు, నివృత్తాని= విడిచిపోయిన వానిని, న కాంక్షతి= కోరడు.

శ్రీ భగవానుడు పలికెను - ఓ పాండవా ! సత్త్వగుణ కార్యరూపమైన ప్రకాశము, రజోగుణకార్యరూపమైన ప్రవృత్తి తమోగుణ కార్యరూపమైన మోహము, తమంతట తామే ఏర్పడినప్పుడు త్రిగుణాతీతుడు ద్వేషింపడు -ప్రాప్తించనపుడు ఆశించడు.

23 ఉదాసీనవదాసీనో గుణైర్యో న విచాల్యతే ।

గుణా వర్తంత ఇత్యేవ యోఽవతిష్ఠతి నేంగతే ॥

ఉదాసీనవత్- ఆసీనః-గుణైః-యః-న-విచాల్యతే

గుణాః-వర్తంతే- ఇతి- ఏవ-యః-అవతిష్ఠతి-న- ఇంగతే

యః= ఎవడు, ఉదాసీనవత్= తటస్థునివలె, ఆసీనః= ఉన్నవాడై, గుణైః= గుణములచేత, న విచాల్యతే= చలింపబడడో, గుణాః= గుణములు, వర్తంతే ఇతి ఏవ= ప్రవర్తించుచున్నవనియే, అవతిష్ఠతి= తలంచుచున్నాడో, న ఇంగతే= చలింపడో

త్రిగుణములకును, వాటి కార్యరూపములైన శరీరేంద్రియాంతఃకరణ వ్యాపారములకును ఏ మాత్రము చలింపక, త్రిగుణాతీతుడు, సాక్షివలె ఉండును. గుణములే గుణములయందు ప్రవర్తించుచున్నవని తలంచును. అతడు సచ్చిదానందఘనపరమాత్మ యందు ఏకీభావస్థితుడై యుండును. ~~ఈ~~ స్థితినుండి ఎన్నడును చలింపడు.

24 సమదుఃఖసుఖః స్వస్థః సమలోష్టాశ్మకాంచనః ।

తుల్యప్రియాప్రియో ధీరః తుల్యనిందాత్మసంస్తుతిః ॥

సమదుఃఖసుఖః-స్వస్థః=సమలోష్టాశ్మ కాంచనః

తుల్యప్రియాప్రియః-ధీరః-తుల్యనిందాత్మసంస్తుతిః

సమదుఃఖసుఖః= సుఖదుఃఖములయందు సముడును, స్వస్థః= తనలో తానుండువాడును, సమలోష్టాశ్మకాంచనః= మట్టిగడ్డను రాతిని బంగారమును సమముగా జూచువాడును, తుల్యప్రియాప్రియః= ప్రియాప్రియములను సమముగా జూచువాడును, ధీరః= ధీరుడును, తుల్యప్రియాప్రియః= ప్రియాప్రియములను సమముగా జూచువాడును, ధీరః= ధీరుడును, తుల్యనిందాత్మ సంస్తుతిః= నిందాస్తుతుల యందు సమబుద్ధిగలవాడును.

త్రిగుణాతీతుడు స్వస్వరూపమునందే నిరంతరము స్థితుడై యుండును. సుఖదుఃఖములను సమానముగా భావించును. మట్టి, రాయి, బంగారముల యందు సమభావమునే కలిగియుండును. అనగా ఆ మూడింటియందును గ్రాహ్యత్యాజ్య భావములను కలిగియుండడు. అతడే ధీరుడైన జ్ఞాని. ప్రియా ప్రియములకు గాని, నిందాస్తుతులకు గాని తొణకడు. అనగా రెండింటి యందును సమస్థితిలోనే యుండును.

25 మానావమానయోస్తుల్యః తుల్యో మిత్రారిపక్షయోః ।

సర్వారంభపరిత్యాగీ గుణాతీతః స ఉచ్యతే ॥

మానాపమానయోః-తుల్యః-తుల్యః-మిత్రారిపక్షయోః

సర్వారంభ పరిత్యాగీ-గుణాతీతః-సః- ఉచ్యతే

మానాపమానాయోస్తుల్యః= మానావమానములను సమానముగా జూచువాడును, మిత్రారిపక్షయోఃతుల్యః= శత్రుమిత్ర పక్షములయందు తుల్యుడును, సర్వారంభపరిత్యాగీ = కర్తృత్వాభిమానమును త్యజించినవాడును, యః= ఎవడో, సః=వాడు, గుణాతీతః= గుణాతీతుడని, ఉచ్యతే=చెప్పబడుచున్నాడు.

మానావమానములయందును, మిత్రులయందును, శత్రువుల యందును సమభావముతో ప్రవర్తించువాడును, విధ్యుక్తకర్మలను ఆచరించుచు కర్తృ త్వాభిమానము లేనివాడును ఐనవాడు త్రిగుణాతీతుడని చెప్పబడును.

26 మాం చ యోఽవ్యభిచారేణ భక్తియోగేన సేవతే ।

స గుణాన్ సమతీత్యైతాన్ బ్రహ్మభూయాయ కల్పతే ॥

మాం-చ-యః-అవ్యభిచారేణ-భక్తియోగేన-సేవతే

సః-గుణాన్-సమతీత్య- ఏతాన్-బ్రహ్మభూయాయ-కల్పతే

యః= ఎవడు, అవ్యభిచారేణ= ఏకాంతమైన, భక్తియోగేన=భక్తియోగముచేత, మాం=నన్ను, సేవతే= సేవించుచున్నాడో, సః=వాడు, ఏతాన్= ఈ, గుణాన్= గుణములను, సమతీత్య= అతిక్రమించి, బ్రహ్మభూయాయ= బ్రహ్మత్వమునకు, కల్పతే చ= కల్పింపబడుచున్నాడు.

నిర్మలమైన భక్తియోగముద్వారా నన్నే నిరంతరము భజించువాడును, ఈ మూడు గుణములకును పూర్తిగా అతీతుడైనవాడును అగు పురుషుడు పరబ్రహ్మ స్వరూపమును పొందుచున్నాడు.

27 బ్రహ్మణో హి ప్రతిష్ఠాహమ్ అమృతస్యావ్యయస్య చ ।

శాశ్వతస్య చ ధర్మస్య సుఖస్యైకాంతికస్య చ ॥

బ్రహ్మణః-హి-ప్రతిష్ఠా-అహం-అమృతస్య-అవ్యయస్య-చ

శాశ్వతస్య-చ-ధర్మస్య-సుఖస్య- ఏకాంతికస్య-చ

అహం=నేను, అమృతస్య= అమృత స్వరూపము, అవ్యయస్య చ=అవ్యయమును అయిన, బ్రహ్మణః= బ్రహ్మమునకు, శాశ్వతస్య= శాశ్వతమైన, ధర్మస్య చ= ధర్మమునకు, ఏకాంతికస్య= అచంచలమైన, సుఖస్య చ = సుఖమునకును, ప్రతిష్ఠా హి= ఆశ్రయుడను గదా.

ఏలనన అట్టి శాశ్వతపరబ్రహ్మకును, అమృతత్వమునకును, సనాతన ధర్మమునకును, అఖండానందమునకును నేనే ఆశ్రయుడను.

ఓం తత్సదితి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు

బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే

శ్రీకృష్ణార్జునసంవాదే గుణత్రయవిభాగయోగో నామ

చతుర్దశోఽధ్యాయః ॥